అభివృద్ధిపథంలో గ్రామాలు

● జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రాజా

పూసపాటిరేగ : గ్రామాలను అభివృద్ధిపథంలో పయనింపజేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఎల్‌ఎన్‌వీ శ్రీధర్‌రాజా అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న సర్పంచ్‌ల శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్పంచ్‌లు పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ సర్పంచ్‌లకు సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.రాధిక, ఈఓపీఆర్‌ఈడ శ్రీనివాసరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.


శిక్షణలో నేర్చుకున్న అంశాలపై కార్యదర్శిని ప్రశ్నిస్తున్న డీపీఓ శ్రీధర్‌రాజా

బాధ్యతల స్వీకరణ


ఎంపీడీఓను అభినందిస్తున్న కార్యదర్శులు

నెల్లిమర్ల: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా జి. గిరిబాల బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.

పోలిపల్లి పీహెచ్‌సీ తనిఖీ


పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

భోగాపురం: మండలంలోని పోలిపల్లి పీహెచ్‌సీని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి భాస్కరరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జ్వరపీడితులకు మలేరియా నిర్ధారణ పరీక్షలు చేసి వైద్యసేవలు అందించాలని సూచించారు. ఈయన వెంట సీహెచ్‌ఓ చంద్రశేఖర్‌రాజు, డాక్టర్ వెంకటేష్, హెల్త్ ఎడ్యుకేటర్ అనిల్‌కుమార్ ఉన్నారు.

సేవలతోనే గుర్తింపు ● డీఎస్పీ గోవిందరావు

పూసపాటిరేగ: విధి నిర్వహణలో అంకిత భావంతో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని విజయనగరం డీఎస్పీ గోవిందరావు అన్నారు. స్థానిక ఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో బదిలీపై వెళ్తున్న భోగాపురం రూరల్ సీఐ బి. వెంకటేశ్వరరావును సన్మానించారు. కార్యక్రమంలో సీఐలు రామకృష్ణ, రవికుమార్, ఎస్సైలు ఎ. సన్యాసినాయుడు, కృష్ణమూర్తి, రామగణేష్, ప్రజాప్రతినిధులు మహంతి చిన్నంనాయుడు, పతివాడ అప్పలనాయుడు, ఎంవీజీ శంకరరావు, బి. శ్రీదర్, ప్రసాదరావు, సన్యాసినాయుడు, జనార్ధనరావు, శివ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు అభినందనలు

పూసపాటిరేగ: హెచ్ఐవీపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని మండల విద్యాశాఖాధికారులు ఎ. రాజ్‌కుమార్, బి.పాపినాయుడు అన్నారు. బుధవారం స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో విద్యార్థులకు రెడ్‌రిబ్బన్ పేరుతో హెచ్ఐవీ వ్యాధిపై అవగాహన కొరకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

విజయనగరం టౌన్: జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘాల సమాఖ్య అధ్యక్షుడు టీవీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిరుపేదలైన ఇద్దరు ఆడపిల్లల వివాహానికి రూ. 76 వేలు అందజేసినట్లు సమాఖ్య కోశాధికారి కూర్లెళ్ల సరోజిని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సేవా కార్యక్రమాలు చేపట్టడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

పరామర్శ


సత్యంను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సీతారామునిపేట గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు బూర్లె సత్యంను మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు బుధవారం పరామర్శించారు. సత్యం సతీమణి కృష్ణమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గ్రామానికి చేరుకుని వారిని పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ సారిక వైకుంఠం, నాయకులు రామారావు, తులసి, తదితరులు ఉన్నారు.

నిరంతర పర్యవేక్షణ అవసరం


విద్యార్థులతో మాట్లాడుతున్న అప్పారావు

విజయనగరం ఫోర్ట్: విద్యార్థులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. స్థానిక పూల్‌బాగ్‌లోని మోడల్ స్కూల్‌ను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులు, వంట గదులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

● ఎమ్మెల్యే లోకం నాగమాధవి

నెల్లిమర్ల రూరల్: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని పెద బూరాడపేట ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మానవ మనుగడకు చెట్లు జీవనాధారాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ..


నగరంలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

విజయనగరం: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని బీజేవైఎం రాష్ట్రవర్గ సభ్యులు రాజాన రమణ అన్నారు. భారతీయ జనతా యువమోర్చా విజయనగరం శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక శ్రీనివాస జూనియర్ కళాశాల నుంచి తిరంగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవరావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి ఇంటి మీదా జెండా ఎగురవేయాలని సూచించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలపాటి రాజేష్ వర్మ, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజాన రమణ, తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

జరజాపుపేటలో రక్తదాన శిబిరం


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

నెల్లిమర్ల: ప్రముఖ సినీ నటుడు చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా గల్ఫ్ దేశాల ఎన్ఆర్ఐ జనసేన ఆధ్వర్యంలో జరజాపుపేటలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. నల్లి సాయి, రాజు బ్రదర్స్ న్యూ లైఫ్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో స్థానిక నల్లి సూరిబాబు స్మారక కళావేదిక వద్ద నిర్వహించిన శిబిరాన్ని ఎమ్మెల్యే లోకం నాగమాధవి ప్రారంభించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, కౌన్సిలర్లు అవనాపు సత్యనారాయణ, కె. కళావతి, జనసేన నాయకులు నల్లి చంద్రశేఖర్, ఎంఎం నాయుడు, పాండ్రంకి సత్యనారాయణ, చందక రామదాసు, రత్నం, తదితరులు పాల్గొన్నారు.